సాక్షి కామారెడ్డి

మంగళవారం। 16। ఏప్రిల్। 2024



కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పాలి

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికలలో బుద్ధి చెప్పాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు.

- 8లో ▸



ప్రధాని కావడం ఖాయం

రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతా రావ్ పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
39.8 /23.0

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపటి వరకు రేషన్ పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న ఏప్రిల్ నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ బుధవారం వరకు కొనసాగనుంది. ఇప్పటివరకు బియ్యం తీసుకోని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లద్దూరి లక్ష్మీపతి యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు.

బోధన్-బీదర్ రైల్వేలైన్ మంజూరుకు కృషి



బాన్సువాడ : తనను ఎంపీగా గెలిపిస్తే బోధన్-బీదర్ రైల్వేలైన్ మంజూరుకు కృషి చేస్తానని ఎంపీ బీబీపాటిల్ అన్నారు. సోమవారం బాన్సువాడలో బూత్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016లోనే రైల్వేలైన్‌కు ప్రతిపాదనలు పంపించామని, కేంద్రం జాయింట్ వెంచర్‌గా ఆమోదిస్తే గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తేనే పనులు జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రపంచంలో మన దేశాన్ని ముందుంచిన ఘనత మోదీదేనని అన్నారు. ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీ నారాయణ, మాజీ ఎమ్మెల్యే గంగారాం, గు దుగుట్ల శ్రీనివాస్, ప్రసాద్, చీదరి సాయిలు, సాయిరెడ్డి, దాకయ్య, దొరబాబు, శ్రీనివాస్‌రెడ్డి, పైడిమల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు ఆర్ట్స్ కళాశాలలో పొలిటికల్ వర్క్‌షాప్

కామారెడ్డి అర్బన్: 'ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఓటర్ల భాగస్వామ్యం' అనే అంశంపై మంగళవారం కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరవుతారని, ఆయా రంగాల విషయ నిపుణులు పాల్గొంటారని పేర్కొన్నారు.

20 నుంచి క్రికెట్ శిక్షణ శిబిరం

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఈనెల 20 నుంచి నెల రోజులపాటు ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శిబిరం ఇన్‌చార్జి ఎండీ మోజమ్ అలీ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, కామారెడ్డి క్రికెట్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో పాల్గొనాలన్న ఆసక్తిగలవారు 96666 77786 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కామారెడ్డి టౌన్: లింగంపేట మండలం శెట్పల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు టీచర్ శ్రీనివాస్ శర్మ సస్పెండ్ అయ్యారు. ఈ విషయాన్ని డీఈవో ఎస్.రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆయనపై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

బల్దియా హస్తగతం!

- చైర్‌పర్సన్‌గా ఇందుప్రియ ఎన్నిక
- నిరాశతో వెనుదిరిగిన కౌన్సిలర్ వనిత వర్గం
- సమావేశానికి హాజరుకాని బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు

కామారెడ్డి బల్దియా హస్తగతం అయ్యింది. ఎలాంటి మలుపులు లేకుండా ఎన్నిక ప్రక్రియ సజావుగా సాగింది. చైర్‌పర్సన్‌గా గడ్డం ఇందుప్రియ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా చైర్‌పర్సన్ పదవిని ఆశించిన కాంగ్రెస్ కౌన్సిలర్ వనిత వర్గం ఎన్నిక అనంతరం నిరాశతో వెనుదిరిగింది.



ఇందుప్రియకు మద్దతుగా చేతులెత్తిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్ : కాంగ్రెస్ సభ్యులు బల్దియా చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై గతనెల 30వ తేదీన అవిశ్వాసం ప్రవేశపెట్టగా.. కొందరు బీఆర్ఎస్ సభ్యులు మద్దతు ఇవ్వడంతో అవిశ్వాసం నెగ్గింది. దీంతో నూతన చైర్‌పర్సన్ ఎన్నిక కోసం అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా చైర్‌పర్సన్ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి బీఆర్ఎస్, బీజేపీ ప్రయత్నాలు చేయడం, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు పదవిని ఆశించడంతో బల్దియా రాజకీయాలు ఉత్కంఠగా మారాయి. కాంగ్రెస్ సభ్యులు క్యాంప్‌నకు వెళ్లారు.

సీల్డ్ కవర్‌లో అభ్యర్థి పేరు..

కామారెడ్డి బల్దియాలో 49 వార్డులున్నాయి. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఓటు హక్కు కలిగి ఉన్నారు. చైర్‌పర్సన్ ఎన్నిక కోసం 26 మంది సభ్యుల కోరం అవసరం. కాగా సోమవారం ఆర్డీవో రఘునాథ్ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. కాంగ్రెస్ క్యాంపులో ఉన్న 28 మంది కౌన్సిలర్లు ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక బస్సులో నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు సమావేశానికి దూరంగా ఉన్నారు. కాంగ్రెస్‌నుంచి ఇద్దరు పదవిని ఆశించడంతో ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం సీల్డ్ కవర్‌లో అభ్యర్థి పేరును పంపింది. సీల్డ్ కవర్‌లో వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పేరుండడంతో ఆమె నామినేషన్ దాఖలు చేశారు. 48వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ అన్వర్ అహ్మద్, 38 వ వార్డు కౌన్సిలర్ చాట్ల రాజేశ్వర్‌లు ఆమె పేరును ప్రతిపాదించగా.. సభ్యులంతా చేతిలెత్తి ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో ఇందుప్రియ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో ప్రకటించారు. ఎన్నిక పత్రాన్ని అందించి, ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో కార్యాలయం బయట కాంగ్రెస్ నాయకులు టపాకాయలు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.



ఇందుప్రియతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఆర్డీవో

అవాక్కయిన పదో వార్డు కౌన్సిలర్..

గడ్డం ఇందుప్రియతోపాటు పదో వార్డు కౌన్సిలర్ ఉర్దొండ వనిత చైర్‌పర్సన్ పదవిని ఆశించారు. అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ఇరువురు తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని క్యాంపులో ఇరు వర్గాల మధ్య గొడవ కూడా జరిగినట్లు తెలిసింది. దీంతో పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇరు వర్గాలను సముదాయించినట్లు సమాచారం. ఇందుప్రియను ఎంపిక చేసి సీల్డ్ కవర్‌లో ఆమె పేరును పంపించింది. చివరి క్షణంలో ఇందుప్రియ పేరు ప్రకటించడంతో వనితతో పాటు ఆమె వర్గం కౌన్సిలర్లు అవాక్కయ్యారు. ఎన్నిక ప్రక్రియ ముగిసిన అనంతరం వనితతో పాటు ఒక్కరొక్కరుగా 12 మంది కౌన్సిలర్లు అక్కడి నుంచి నిరాశతో వెళ్లిపోయారు.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తా..

కామారెడ్డి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పేర్కొన్నారు. ఎన్నిక అనంతరం బల్దియా కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అవినీతి రహిత పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. అన్ని వార్డుల కౌన్సిలర్‌ల సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు నుంచి వచ్చిన కాంగ్రెస్ కౌన్సిలర్లు



నిందితులతో మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌వో

బిజినెస్ టీచర్ లీలలు

- ఎస్ఎల్‌వీఎస్ పేరిట చిట్‌ఫండ్ కంపెనీ
- 10 పట్టణాల్లో బ్రాంచ్‌లు, వందల మంది కస్టమర్లు
- కుటుంబం పేరు మీద వ్యాపారం చేసి చేతులెత్తేసిన వైనం
- కామారెడ్డి కస్టమర్లకు రూ.2 కోట్లు టోకరా
- నలుగురిని అరెస్ట్ చేసిన పట్టణ పోలీసులు

కామారెడ్డి క్రైం: అతనో బాధ్యత గల ఉపాధ్యాయుడు. అత్యాశతో చిట్టీలు నిర్వహించి, ఖాతాదారులను మోసగించి చివరికి జైలు పాలయ్యాడు. తనతోపాటు కుటుంబ సభ్యులనూ జైలు ఊచలు లెక్కింపజేస్తున్నాడు. కామారెడ్డి ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డికి చెందిన బిల్ల దశరథ్‌రెడ్డి ప్రభుత్వ టీచర్‌గా పని చేస్తున్నారు. ఆయన తన భార్య పద్మావతి, కుమారుడు నితీష్‌రెడ్డిల పేరిట హైదరాబాద్ రోడ్డులోని ఓ భవనంలో ఎస్ఎల్‌వీఎస్ చిట్‌ఫండ్ కంపనీ ఏర్పాటు చేశారు. ఎస్ఎల్‌వీఎస్ పేరు మీద కామారెడ్డితో పాటు నిజామాబాద్, కొంపల్లి, షాద్‌నగర్, సిద్దిపేట, మెదక్, వికారాబాద్, మెట్‌పల్లి, వనపర్తి తదితర పట్టణాల్లో బ్రాంచ్‌లు తెరిచారు. ఏజెంట్‌ల ద్వారా వందల సంఖ్యలో కస్టమర్లను చేర్చుకున్నారు. చిట్‌ఫండ్ నిర్వాహకులు 30 వరకు చిట్టీలు నడిపించినట్లు తెలుస్తోంది. సదరు చిట్‌ఫండ్ కంపెనీలో పట్టణానికి చెందిన అహ్మద్ మోహీయుద్దీన్ రెండు చిట్టీలు వేశాడు. చిటీ కాలం పూర్తయినా డబ్బులు ఇవ్వలేదు. చాలాసార్లు అడిగినా స్పందన లేకపోవడంతో విసిగిపోయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా చిట్‌ఫండ్ కంపెనీ పేరిట జరుగుతున్న మోసాలు వెలుగులోకి వచ్చాయి.

వందల సంఖ్యలో బాధితులు..

ఎస్ఎల్‌వీఎస్ చిట్‌ఫండ్ కంపెనీ డబ్బులు చెల్లించకపోవడంతో రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్‌కు చాలామంది ఫిర్యాదు చేశారని విచారణలో తేలిందని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డిలో ఈ చిట్‌ఫండ్ కంపెనీకి చెందిన 30 మందికి పైగా బాధితులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. వారందరి స్టేట్‌మెంట్‌లను నమోదు చేశామన్నారు. ఒక్క కామారెడ్డిలోనే దాదాపు రూ.2 కోట్ల మేర మోసం జరిగినట్లు తెలుస్తోందన్నారు. అన్ని బ్రాంచ్‌లలో కలిపి రూ.50 కోట్ల వరకు కస్టమర్లకు టోకరా వేసినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడైన దశరథరెడ్డితోపాటు అతడి భార్య పద్మావతి, కుమారులు నితీష్‌రెడ్డి, అచ్యుత్‌రెడ్డిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామని ఎస్‌హెచ్‌వో తెలిపారు. వారి వద్ద నుంచి 5 సెల్‌ఫోన్‌లు, ఒక కారు, డాక్యుమెంట్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్ఎల్‌వీఎస్ చిట్‌ఫండ్ కంపెనీ బాధితులు ఎవరైనా ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఈ నెల 25 నుంచి మే 2 వరకు నిర్వహించే పదో తరగతి, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో ఓపెన్ పరీక్షలకు పదో తరగతి విద్యార్థులు 923 మంది, ఇంటర్‌కు 1,444 మంది హాజరుకానున్నట్లు వెల్లడించారు. పదో తరగతి పరీక్షలకు బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డిలో 5, ఇంటర్‌కు 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటర్ సైన్స్ గ్రూపులకు సంబంధించిన ప్రాక్టికల్స్ మే 3 నుంచి 10 వరకు జరుగుతాయన్నారు. కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని, వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు షెడ్యూల్ ప్రకారం బస్సులు నడపాలన్నారు. డీఈవో రాజు, పరీక్షల సహాయ కమిషనర్ లింగం, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, ఆర్టీసీ డీఎం ఇందిర పాల్గొన్నారు.

బల్దియాను అవినీతి రహితంగా మారుస్తాం

- ఎనిమిది నెలల్లో పట్టణ సమస్యల పరిష్కారం
- వైస్ చైర్‌పర్సన్‌గా వనితను ఎంపిక చేస్తాం
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ


కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మున్సిపాలిటీని అవినీతి రహితంగా మారుస్తామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. ఇన్నాళ్లు బల్దియాలో అవినీతి పాలన సాగిందన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్‌ను ఇందుప్రియను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలో 10వ వార్డు కౌన్సిలర్ ఉర్దొండ వనితను ఏకగ్రీవంగా ఎన్నుకుంటామని ప్రకటించారు. ఎనిమిది నెలల్లో మున్సిపాలిటీలో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పట్టణంలో మూముళ్ల జోలికి పోవద్దని కౌన్సిలర్‌కు సూచించారు. ఎన్నికల తర్వాత సీఎం సమక్షంలో మిషన్ భగీరథ అధికారులతో సమావేశం నిర్వహించి పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. ఇందిరాగాంధీ స్టేడియంలో 24 గంటల లైటింగ్ సౌకర్యం కల్పించి వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో తాను చదువుకున్న బాలుర ఉన్నత పాఠశాల కూలిపోయే స్థితిలో ఉందని రూ.23 కోట్లతో నూతన పాఠశాల నిర్మాణం చేపడతామన్నారు. సొంత డబ్బుతో ఇతర వసతులు ఏర్పాటు చేస్తానని ప్రకటించారు.

చేతికి చిప్ప ఇచ్చిన కేసీఆర్

కేసీఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేసి కాంగ్రెస్ చేతిలో చిప్ప పెట్టారని షబ్బీర్ అలీ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 90 రోజుల్లో 31 వేల ఉద్యోగాలిచ్చి చరిత్రలో నిలిచామని, ఎన్నికల కోడ్ తర్వాత మరొక 50 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. నాడు ఫోన్ ట్యాపింగ్‌పై తాను చెప్పిన మాటలు నేడు నిజమని తేలాయని అన్నారు. తనకున్న సమాచారం ప్రకారం త్వరలో కేసీఆర్ కుటుంబం జైలుకు పోయే అవకాశం ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. పదేళ్లలో ఎంపీ బీబీపాటిల్ కేంద్రం నుంచి గాని, రాష్ట్రం నుంచి గాని పైసా పని చేయలేదని విమర్శించారు. పార్లమెంట్ పరిధిలో ఒక్క మండలం పేరైనా ఆయనకు తెలుసా అని ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల్లో జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ శెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు పండ్ల రాజు, గోనె శ్రీను, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రామనవమి.. నేతల హడావుడి

- సాధ్యమైనన్ని చోట్ల సీతారాముల కల్యాణానికి హాజరయ్యేందుకు ఏర్పాట్లు
- ఎన్నికల నేపథ్యంలో పార్టీల అభ్యర్థులతో పాటు నాయకుల పాట్లు
- అయోధ్య ఆలయ ప్రారంభం నుంచి దూకుడు పెంచిన బీజేపీ
- శ్రీరాముడు అందరివాడంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అయోధ్యలో శ్రీరాముడి మందిరాన్ని జనవరి 22న ప్రారంభించిన నేపథ్యంలో అప్పటి నుంచి దేశమంతా రామనామం మార్మోగుతోంది. ఈ క్రమంలో కొన్నిరోజుల తేడాతోనే కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల శంఖారావానికి షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మధ్యలోనే శ్రీరామనవమి పర్వదినం వస్తోంది. రేపు శ్రీరామనవమి పండుగ కావడంతో అన్నిచోట్ల రాజకీయ పార్టీల శ్రేణుల హడావుడి కనిపిస్తోంది. ముఖ్యంగా కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న జహీరాబాద్, నిజామాబాద్ లోక్‌సభ స్థానాల పరిధిలో భక్తి ప్రభావం ఎక్కువ. దీంతో రామజన్మభూమి అంశం ఈ రెండు స్థానాల్లో కీలక ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఈ అంశం తమ పేటెంట్ హక్కుగా భావించే బీజేపీ శ్రేణులు అయోధ్య రామాలయం విషయమై మరింత గట్టిగా ప్రచారం చేసుకునేందుకు క్షేత్రస్థాయిలో ఇప్పటికే ప్రచారం ప్రారంభించాయి. అయోధ్యలో మందిరం ప్రారంభానికి ముందు ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేసే విషయంలో సంఘ్‌పరివార్, విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శ్రీరామనవమి వేడుకల్లో సైతం తమ ప్రభావం ఉండేలా చూసుకుంటున్నారు. మూడు నెలల క్రితం అయోధ్య బాలరాముడి ఆలయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించడం, తాజాగా శ్రీరామనవమి కల్యాణం వాడవాడలా చేయనుండడంతో ఈ ప్రభావం తమకు బాగానే కలిసొస్తుందని బీజేపీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ అంశాన్ని గట్టిగా ఉపయోగించుకునేందుకు నిజామాబాద్, జహీరాబాద్ బీజేపీ అభ్యర్థులు ధర్మపురి అర్వింద్, బీబీ పాటిల్ తమ శ్రేణులను ముందుకు నడిపిస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ఈ ప్రాంతంలో బీజేపీ మంచి విజయాలను నమోదు చేసుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో మరింత ఫలితం రాబట్టుకునేందుకు అటు బీజేపీ శ్రేణులు, ఇటు సంఘ్‌పరివార్ శ్రేణులు సైతం పకడ్బందీగా వ్యవహరిస్తూ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు కసరత్తు చేస్తున్నాయి. ముఖ్యంగా మహిళల ఓట్లను భారీగా రాబట్టుకునేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సైతం..

అయోధ్య రామమందిరం అంశాన్ని, శ్రీరామనవమి ఉత్సవాలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్న బీజేపీకి దీటుగా తాము తగ్గేదేలేదంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు, నాయకులు ప్రచార పర్వంలో దూసుకెళ్తున్నారు. శ్రీరాముడు అందరివాడని, ఒక్క బీజేపీకి మాత్రమే పేటెంట్ కాదంటూ ఈ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారు. రాముడి పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తోందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విమర్శలను బీజేపీ ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకెళ్తోంది. అయితే నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, జహీరాబాద్ అభ్యర్థి సురేష్ షెట్కార్ మాత్రం ముస్లిం ఓట్లు తమకే గంపగుత్తగా పడతాయనే ధీమాతో ఉన్నారు. అదేవిధంగా హిందూ ఓట్లలో వివిధ సామాజిక వర్గాల ఓట్లు తమకు భారీగా వస్తాయని లెక్కలు వేసుకుంటున్నారు. బీఆర్ఎస్ నిజామాబాద్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ సైతం త్రిముఖ పోటీలో తనకు కలిసివస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు.

ఉపాధికి ఊతం

- వేసవి అలవెన్స్ రూ.28 పెంపు
- రూ.272 నుంచి రూ.300కు పెరిగిన కూలి



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

కామారెడ్డి రూరల్ : జిల్లాలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఎండలు మండుతుండటంతో కూలీలకు వేసవి భత్యం రూ.28 అందనంగా ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో రూ.272గా ఉన్న కూలి రూ.300కు పెరిగింది. ఈ నెల 1 నుంచి వేసవి అలవెన్స్ అమలు చేస్తున్నారు. జిల్లాలో 526 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 2,49,497 జాబ్‌కార్డులు ఉండగా 4,77,620 మంది కూలీలు ఉన్నారు. ఏప్రిల్‌లో నిత్యం సగటున 57 వేల మంది కూలీలు పనులకు హాజరు అవుతున్నారు. ఇది గత నెలతో పోలిస్తే 37 వేలు అధికం. కలెక్టర్, అధికారులు రోజు వారి సమీక్షలు, క్షేత్ర స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించడంతో కూలీల సంఖ్య పెరిగింది. గత నెల వ్యవసాయ పనులు ఉండడంతో కూలీల సంఖ్య తక్కువగా నమోదైంది. ప్రస్తుతం ప్రతీ గ్రామంలో సగటు కంటే ఎక్కువగా పనులు చేపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కూలీల సంఖ్య పరంగా జిల్లా 15వ స్థానంలో ఉంది. సగటున 100 రోజులకు 34 రోజులు పనులు కల్పిస్తున్నారు. వేసవి భత్యం అమలు చేయడంతో పనులు మరింత మంది కూలీలు హాజరయ్యే అవకాశం ఉంది.

గుర్తించే పనులు

ఏటా అక్టోబర్ 2 నుంచి జనవరి 31 వరకు ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు గుర్తించారు. ప్రాధాన్యత క్రమంలో వాటి అమలులో నిర్ణయాలు తీసుకుంటారు. మొక్కలు నాటడం, చెరువుల్లో పూడికతీత, పంటకల్లాలు, మరుగుదొడ్లు, ఇంకుడుగుంతల నిర్మాణం, మట్టి రోడ్డు వేసుకోవడం, రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించడం, రహదారుల అనుసంధానం, ఇంకుడుగుంతలు, కల్లాల నిర్మాణం, కిచెన్ షెడ్లతో పాటు 250 వరకు పనులు చేపట్టవచ్చు.

జిల్లాలో ఉపాధి కూలీల వివరాలు

జీపీలు	526
జాబ్‌కార్డులు	2,49,497
మొత్తం కూలీలు	4,77,620
పని కల్పించిన జాబ్‌కార్డులు	1,01,423
పని కల్పించిన కూలీలు	1,56,313
వంద రోజులు పని పూర్తి చేసిన కార్డులు	2,072



కూలీలందరికీ పనులు కల్పిస్తాం

జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి ఉపాధి అందేలా కృషి చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో పనులపై అవగాహన కల్పిస్తూ కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ప్రతి జీపీకి 110 మంది కూలీలకు పనులు కల్పిస్తున్నాం. మండలస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి పనుల పురోగతి గురించి చర్యలు తీసుకుంటున్నాం.

– చందర్‌నాయక్, డీఆర్‌డీవో, కామారెడ్డి

క్లుప్తంగా

పిట్లంలో ఇంటింటి ప్రచారం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రమైన పిట్లంలో బీజేపీ పార్టీ నాయకులు దుకాణ సముదాయలు, ఇంటింటికి తీరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ నాయకులు జగదీష్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీకు ఓటు వేసి ఎంపీగా బీబీ పాటిల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కొరారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు అభినయ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వడ్ల శివ, నాయకులు అశోక్‌రాజ్, మంచి శశీధర్, శివాజీరావ్, కాశీరాం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా జిల్లా కమిటీ

కామారెడ్డి టౌన్ : జిల్లాలోని బీజేపీ పార్టీ సంస్థాగత మార్పుల్లో భాగంగా మహిళా మోర్చా జిల్లా కమిటీని నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, మహిళా మోర్చా అధ్యక్షురాలు విశ్వనాథుల అనిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా మీనాబాయి, గంగలక్ష్మి, పావనతి, సుశీలా, ప్రధాన కార్యదర్శులుగా సంగీత, హారిక, కార్యదర్శులుగా లక్ష్మి సూర్యప్రభ, మానస, సుజాత, స్వప్న, కోశాధికారిగా స్వరూప, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా శ్రీజ, 12 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కమిటిని ప్రకటించారు.

వీవీఎస్ఎస్ అధ్యక్షుడి నియామకం



కామారెడ్డి టౌన్ : విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి(వీవీఎస్ఎస్)జిల్లా అధ్యక్షుడిగా గాడి నర్సింలు నియమించినట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంగ ఈశ్వర్, రంగ్యానాయక్, బంటు స్వామి, కొండల్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఠారెత్తిస్తున్న ఎండలు



రామారెడ్డి : రామారెడ్డి మండలంలో గత నాలుగు రోజులుగా ఎండలు తక్కుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా మళ్లీ సోమవారం ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. సోమవారం రామారెడ్డి మండలంలో 40.3 గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోడ్లు ఉదయం 11 గంటల నుంచి నిర్మానుష్యంగా మారాయి. మూడు నాలుగు రోజుల క్రితం మండలంలో చిటపటచినుకులు కురవడంతో ఉష్ణోగ్రతలు తగ్గి ఎండలు తగ్గాయి. మే నెలలో ఎండలు ఏ స్థాయిలో ఉంటాయోనని ప్రజలు బెంబేలేత్తుతున్నారు.

సారూ.. బడికి రారూ..

- పరీక్షల సమయంలో స్కూల్‌కు తాళం
- సమయపాలన పాటించని టీచర్
- ఉదయం పది అవుతున్నా తెరుచుకోని వైనం
- పట్టించుకోని విద్యాశాఖ యంత్రాంగం

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని సీతారాం తండాలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సోమవారం ఉదయం 8.30కి తెరవాల్సిన పాఠశాల 10 గంటలవుతున్నా పాఠశాలకు తాళం వేసి ఉంది. ఈ నెలలో ప్రతి ప్రాఠశాలలో ఉదయం 9 గంటల నుండి పరీక్షలు జరుగున్నప్పటికీ ఈ పాఠశాలకు ఉదయం 10 అవుతున్న తాళం వేసి ఉండడం గమనార్హం. దీంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు చెట్ల కొద్దిసేపు కూర్చుని ఇంటికి వెళ్లిపోయారు. ఈ విషయమై విచారణ చేయగా పదిరోజుల నుంచి సదరు టీచర్ పాఠశాలకు రావట్లేదని తెలిసింది.

నిర్లక్ష్యం చేస్తున్నారు..

పెద్దకొడప్‌గల్ మండలంలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల



తాళం వేసి ఉన్న సీతారాం తండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

పర్యవేక్షణ లేకపోవడంతో పాఠశాలలకు టీచర్లు సమయపాలన పటించకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సీతారాం తండా పాఠశాల ఉపాధ్యాయుడు ఓ సంఘం అధ్యక్షుడు కావడంతో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు పేర్కొంటున్నారు. ఈ విషయమై మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక ఎంఈవో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం నిర్లక్ష్యానికి పరాకష్ట అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చెట్లకింద కూర్చున్న విద్యార్థులు

ఇప్పటికే సదరు అధికారి నిర్లక్ష్యం కారణంగా నాలుగు పాఠశాలలు జీరోగా మారాయని, మరిన్ని పాఠశాలలు కూడా జీరో విద్యార్థుల పాఠశాలలుగా మారే అవకాశాలున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన లేక విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా లేక కొంతమంది విద్యార్థులు కూలీలుగా మారుతున్నారు. ఈ విషయమై సీఆర్‌పీ, కాంప్లెక్స్ హెచ్ఎంను వివరణ కోరగా ఈ విషయమై తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. ఎంఈవోను ఈ విషయమై వివరణ కోరేందుకు ఫోన్‌చేయగా సరైన సమాధానం ఇవ్వలేదు.

నిలిచిన న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

- నాలుగు నెలలగా గర్భిణుల ఎదురుచూపులు
- నిరుపేదలపై ఆర్థిక భారం

బిచ్కుంద(జుక్కల్) : నిరుపేద గర్భిణులు రక్తహీనతను అధిగమించడానికి గత ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు అందజేసే న్యూట్రిషన్ల కిట్ల పంపిణీకి బ్రేక్ పడింది. నాలుగు నెలల నుంచి పంపిణీకి నోచుకోకపోవడంతో కిట్ల కోసం గర్భిణులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. గర్భిణులకు అందాల్సిన మినరల్స్, మాంసకృత్తులు అందక రక్త హీనతతో పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉండడం లేదు. లోపాలతో జన్మించడం శిశు మరణాల సంఖ్య పెరుగుతుండడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో న్యూట్రిషన్ల కిట్ల పంపిణీ ప్రారంభించింది. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భందాల్చిన మహిళలు పేరునమోదు చేసుకొని వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పీహెచ్‌సీ పరిధిలలో న్యూట్రిషన్ల కిట్ల పంపిణీ జరిగేది నాలుగు నెలల నుంచి ఆగిపోవడంతో నిరుపేదలపై ఆహార పదార్థాల కొనుగోళ్లకు ఆర్థిక భారం పడుతోంది. కిట్టులో రూ. 2వేల విలువైన వస్తువులు అందించేవారు. కిలో కర్జూర, ఐరన్ సిరప్‌లు, న్యూట్రిషన్ మిక్స్‌డ్ పౌడర్, 200 గ్రాములు పల్లిపట్టీలు, 500 గ్రాములు నెయ్యి, ఫ్యాట్, ప్రోటీన్, విటమిన్లు కలిగిన వస్తువులు ఉంటాయి. గర్భం దాల్చిన నాలుగో నెలకు ఒకటి, ఎనిమిదో నెలకు ఒకటి చొప్పున రెండు దఫాలుగా గర్భిణులకు కిట్లు అందజేసేవారు. ఒక్కో కిట్టు విలువ రూ. 2 వేలు చొప్పున రెండు కిట్లకు రూ. 4 వేల వరకు నిరుపేద మహిళలకు ప్రయోజనం చేకూరింది. జిల్లాలో 20 పీహెచ్‌సీలు, 4 సీహెచ్‌సీలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 6,030 మంది గర్భిణులకు కిట్ల పంపిణీ జిల్లా అంతట ఆగిపోయింది. పేదలు మార్కెట్‌లో పౌష్టిక పదార్థాలు కొనుగోలు చేసే పరిస్థితి లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భంలో శిశువు పెరుగుతున్నప్పుడు కూలీ, వ్యవసాయ ఇతర పనులకు వెళ్లలేని పరిస్థితి ఉంది. న్యూట్రిషన్ వస్తువులు కొనుగోలు చేయాలన్న కుటుంబంపై ఆర్థిక భారం పడుతుందని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్లను కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.



న్యూట్రిషన్ కిట్టు తీసుకున్న మహిళ(ఫైల్)

జుక్కల్ అభివృద్ధే నా ధ్యేయం

మద్నూర్(జుక్కల్) : జుక్కల్ నియోజికవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన కర్తవ్యమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండలంలోని పెద్ద ఎక్లారలో సోమవారం విజయోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముందుగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ నక్కవార్ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే భార్య సులోచన మృతి పట్ల వారు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఇందిరమ్మ ఇళ్లను పార్టీకి అతీతంగా అర్హులైన వారికి విడతల వారిగా ఇస్తామన్నారు. రెండు సార్లు ఎంపీగా గెలిచిన బీబీ పాటిల్ చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు హన్మంత్‌రావ్ దేశాయ్, మహేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

అంబేడ్కర్ విగ్రహంతో ర్యాలీ

దోమకొండ : మండల కేంద్రంలో సోమవారం రాత్రి అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో గుర్రాల బండిపై అంబేడ్కర్ విగ్రహాన్ని ఊరేగిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన గుర్రాల బండిపై ఆయన విగ్రహాన్ని ఉంచి, విద్యుత్ కాంతులతో ఉండే ప్రత్యేక కాగడాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో దోమకొండతో పాటు వివిధ గ్రామాలకు చెందిన అంబేడ్కర్ సంఘం, యువజన సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



గుర్రం బండిపై అంబేడ్కర్ విగ్రహంతో ర్యాలీ నిర్వహిస్తున్న యువజన సంఘం సభ్యులు

న్యాయం చేయాలని వినతి

కామారెడ్డి అర్బన్: కొందరు పెద్దమనుషులు తనపై కక్షగట్టి చేపలు వేటాడకుండా సొసైటీ నుంచి బహిష్కరించారని నిజాంసాగర్ మండలం మల్లూర్‌కు చెందిన మత్స్యకారుడు పొట్టినాగి బాల్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని సోమవారం కలెక్టర్, మత్స్యశాఖ అధికారికి వి జ్ఞప్తి చేశాడు. మల్లూర్ మత్స్య పారిశ్రామిక సహకా ర సంఘంలో తనకు సభ్యత్వం ఉందని, సయ్యని మైసయ్య, గిర్ని అంజయ్య, గులింగి దుర్గయ్య తన పై కక్షతో సొసైటీలో వాటా ఇవ్వకుండా బహిష్కరించినట్లు తెలిపాడు. చేపల చెరువును ఇతరులకు గుత్తాకు ఇచ్చారని బాల్‌రాజ్ ఆరోపించాడు. తన తల్లి వికలాంగురాలని, తండ్రి చనిపోయాడని, తన పరిస్థితి బాగోలేదని, తనకు న్యాయం చేయాలన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే పల్లెబాట

బాన్సువాడ రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పల్లెబాట, మరోవైపు బస్తీ బాట చేపడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవరం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పల్లెబాటలో భాగంగా మండలంలోని బుడిమి గ్రామంలో పర్యటించి సమస్యలు అడిగి తెల్సుకున్నారు. బుడిమి గ్రామంలో మార్కెట్ కమిటీ గోదాముల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. బుడిమి–తిర్మలాపూర్ వాగుపై వంతెన నిర్మించాలని స్థానికులు కోరారు. అసంపూర్తిగా నిలిచిన మస్జీద్‌ను పరిశీలించారు.పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని రవీందర్ రెడ్డి కోరారు. నాయకులు మాసాని శ్రీనివాస్ రెడ్డి, కొత్తకొండ భాస్కర్,అన్వర్ తదితరులున్నారు.

ఇసుక వేలం



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్, ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం ఇసుక వేలం పాట నిర్వహించారు. మూడు ట్రాక్టర్ల ఇసుకను రూ.12,100కు వేలం ద్వారా విక్రయించినట్లు డిప్యూటీ తహసీల్దార్ నవీన్ తెలిపారు.

కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ/గాంధారి : మోసపూరిత హమీలిచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాన్సువాడ పట్టణంలోని మీనా గార్డెన్, గాంధారి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ పట్టణంలోని 28 పోలింగ్‌కేంద్రాల్లో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ వచ్చిందని, డబుల్ బెడ్‌రూం కాలనీ వాసులు వెయ్యి మెజార్టీ ఇచ్చారన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి రూ.400 కోట్ల బిల్లులు ఇచ్చినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రూ.26 కోట్ల బిల్లుల కోసం ప్రస్తుత మంత్రి వద్దకు వెళితే తనమీద బాన్సువాడలో ఓడిపోయిన కాంగ్రెస్ నాయకుడు అదే మంత్రి వద్దకు వెళ్లి బిల్లులు ఇవ్వొద్దని చెప్పాడని పోచారం మండిపడ్డారు. గతంలో తనవెంట ఉన్న కొంత మంది నాయకులు రూ. రెండు, మూడు లక్షలకు ఆశపడి ఈ మధ్య కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. తన రాజకీయవారసుడిగా పోచారం భాస్కర్‌రెడ్డిని నిలబెట్టానని తెలిపారు.

పటాన్‌చెరు వరకు రైల్వేలైన్..

జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి అనీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. అనిల్‌కుమార్‌ను గెలిపిస్తే బోధన్ నుంచి బాన్సువాడ మీదుగా పటాన్ చెరు వరకు రైల్వేలైను ఏర్పాటు చేయిస్తామన్నారు. ఆయా సమావేశాల్లో ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు నల్లమడుగు సురేందర్, జనార్దన్‌గౌడ్, జెడ్పీటీసీ శంకర్‌నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్లు సత్యం, సత్యంరావు, గాంధారి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శివాజీరావు, నాయకుడు రెడ్డి రాజు, బాన్సువాడ బీఆర్ఎస్ నాయకులు బద్యానాయక్, జంగం గంగాధర్, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌నాయక్, దాసరి శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, పిట్ల శ్రీధర్, గురువినయ్, పద్మ గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అప్ప తీర్చమన్నందుకు హతమార్చారు

- హత్యకేసులో భార్యాభర్తల అరెస్ట్
- ఈనెల 10న హత్యకు గురైన మహిళ

నవీపేట : మండలంలోని కోస్లీ శివారులో ఉన్న అలీసాగర్ కాలువలో ఈనెల 10వ తేదీన ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు అప్పుతీర్చమన్నందుకు సదరు మహిళను హత్య చేశారని తేల్చారు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, నవీపేట ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రెంజల్ మండలం బోర్గాం గ్రామానికి చెందిన చంద్రకళ వద్ద అదే గ్రామానికి చెందిన భార్యాభర్తలు గోదావరి, గంగాధర్ రూ.50వేలు అప్పుగా తీసుకున్నారు. గడువు సమీపిస్తున్న తరుణంలో డబ్బులు తిరిగిచెల్లించాలని చంద్రకళ వారిని కోరగా, వారు సమాధానం ఇవ్వలేదు. చంద్రకళను హతమార్చాలని పథకం పన్నిన గోదావరి, గంగాధర్ ఈనెల 10న ఆమెను డబ్బులు చెల్లిస్తామని ఇంటికి రప్పించి గొడ్డలితో దాడి చేసి హత్య చేశారు. ఆ తరువాత ద్విచక్రవాహనంపై చంద్రకళ మృతదేహాన్ని తీసుకువచ్చి అలీసాగర్ కాలువలో పారేశారు. నిందితులైన భార్యాభర్తలు గోదావరి, గంగాధర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

ఎలుగుబంటి దాడి



సిరికొండ: మండలంలోని కొండాపూర్ గ్రామా నికి చెందిన మొగుల్ల బాలాగౌడ్‌పై ఎలుగుబంటి దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. మతిస్థిమితం లేని బాలాగౌడ్ ఎల్లప్పుడూ బయటతిరిగే వాడని, ఆదివారం రాత్రి అటవీప్రాంతంలో ఎలుగుబంటి దాడి చేసిందన్నారు. సోమవారం గాయాలతో గ్రామంలోకి వచ్చాడని, అతడిని ప్రశ్నించగా.. ఎలుగుబంటి దాడి చేసినట్లు చెప్పాడన్నారు. బాధితుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కామారెడ్డికి తరలించారు.

తండ్రి మరణం.. బెంగతో కూతురి ఆత్మహత్య



మేఘన (ఫైల్)

ఎడపల్లి(బోధన్): తండ్రి మరణం, ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో మానసికంగా కుంగిపోయిన కూతురు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎడపల్లి మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. 15 ఏళ్ల క్రితం కూనమనేని శ్రీనివాస్ కుటుంబం ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చి ఎడపల్లిలో స్థిర పడింది. శ్రీనివాస్‌కు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండేళ్ల క్రితం కూనమనేని శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి కుమార్తె మేఘన తండ్రిపై బెంగపెట్టుకొని మానసికంగా కుంగిపోయింది. ఈ క్రమంలో ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగోలేదని తల్లి మాట్లాడుతుండగా విన్న మేఘన మనస్తాపానికి గురై సోమవారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఘటనాస్థలాన్ని బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ నరేశ్ పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అప్పు తీర్చలేక ఒకరు..

రుద్రూర్ : అప్పు తీర్చేమార్గంలేక జీవితంపై విరక్తి చెంది వర్ని పోలీస్‌స్టేషన్ పరిధిలోని చందూర్ గ్రామానికి చెందిన మమ్మాయి గిరి (46) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ సోమవారం తెలిపారు. మద్యానికి బానిసైన గిరి అప్పులు చేశాడని, జీవితంపై విరక్తి చెంది చెట్టుకు ఉరేసుకున్నాడన్నారు. మృతుడి భార్య మమ్మాయి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ.. ఒకరి మృతి

రుద్రూర్: కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పొతంగల్ మండలం కారేగాం – హంగర్గా రోడ్డుపై సోమవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారేగాంకు చెందిన శివకుమార్ (37) మృతి చెందాడు. ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కారేగాం నుంచి శివకుమార్ తన భార్యతో కలిసి పొతంగల్ వారసంతకు బయల్దేరగా, చేతన్‌నగర్‌కు చెందిన స్నేహితులు ఎదురుగా బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టారు. ఈ ఘటనలో శివకుమార్‌తో పాటు అతడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శివకుమార్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పూర్తి సమాచారం సేకరిస్తున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

చెరువులోపడి యువకుడు..

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన పయ్యావుల రవితేజ (17) చెరువులోపడి మృతి చెందినట్లు ఎస్సై యూ.మహేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చెరువు వైపు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి ఆదివారం సాయంత్రం బయటికి వెళ్లిన రవితేజ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. రవితేజ ఆచూకీ లభించకపోవడంతో అతడి మేనమామ కార్తీక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం బర్ధిపూర్ చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం నీటిలో రవితేజ మృతదేహం లభించడంతో పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రవితేజది ఆత్మహత్యా? లేక ప్రమాదవశాత్తు నీటిలోపడి మృతి చెందాడా? అనేది దర్యాప్తులో తేలుతుందని ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో లేగదూడ మృతి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని సురాయిపల్లితండాకు చెందిన గుగులోత్ దేవులాకు చెందిన లేగదూడ విద్యుత్ షాక్‌తో సోమవారం మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. మేతకు వెళ్లిన లేగదూడ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగిలి మృతి చెందిందన్నారు. మృతి చెందిన లేగదూడ విలువ రూ.40 వేలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని కోరాడు.

అనారోగ్యంతో మాజీ ఎమ్మెల్యే సతీమణి మృతి



సులోచన(ఫైల్)

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తమ్మేవార్ నాగ్‌నాథ్ సేట్ సతీమణి తమ్మేవార్ సులోచన(97) సోమవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మద్నూర్ మండల కేంద్రానికి చెందిన నాగ్‌నాథ్ సేట్ కాంగ్రెస్‌లో ఉంటూ 1962 నుంచి 1967 వరకు ఎమ్మెల్యేగా సేవలందించారు. 2005లో ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. సులోచన కర్ణాటకలోని గుల్బర్గాలోని కూతురు వద్ద మృతి చెందారని, అక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్..



నక్కవార్ లక్ష్మణ్(ఫైల్)

మద్నూర్(జుక్కల్): మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్కవార్ లక్ష్మణ్(80) ఆదివా రం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారా వు మండల కేంద్రంలో లక్ష్మణ్ మృతదేహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.లక్ష్మణ్ మృతి పార్టీకి తీరని లోటన్నా రు.ఆయనవెంట పార్టీ మండల అధ్యక్షుడు సాయి లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, నాయకులు రమేశ్, జావీద్‌పటేల్, లక్ష్మణ్ ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో న్యాయమూర్తి ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 27 మందికి సోమవారం

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

గాంధారి: మండల కేంద్రంలోని సోయక్ అనే వ్యక్తి ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన సోయక్ పాషా వారంరోజుల క్రితం కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. దుండగుడు తాళం పగులగొట్టి ఇంట్లోని నగదు, బంగారంతోపాటు ఇతర విలువైన వస్తువులను ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన వల్లెపు కాశీరాం చోరీకి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. బాన్సువాడలోని బంధువుల ఇంట్లో ఉన్న కాశీరాంను సోమవారం అదుపులోకి తీసుకొని చోరీ చేసిన సొత్తుతోపాటు ఓ బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కాశీరాం పాత నేరస్తుడని, అతడిపై ఇదివరకు కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు. గతంలో పీడీ యాక్ట్ నమోదు కాగా, సంవత్సరం పాటు జైలు జీవితాన్ని గడిపినట్లు తెలిపారు.

రేషన్ దుకాణాల తనిఖీ

ఎల్లారెడ్డి: పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. పట్టణంలోని ఐదో నంబర్ దుకాణంలో రికార్డులతో పాటు స్టాక్‌ను పరిశీలించారు. టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి, ఏసీఎస్‌వో సుదర్శన్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నలుగురి అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మహమ్మద్ మజార్ అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గొడవల కారణంగా మజార్ భార్య గత 5 సంవత్సరాలుగా మరోచోట ఉంటోందన్నారు. డ్రైవర్‌గా పని చేసే మజార్ మార్చి 30న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాకపోవడంతో తల్లి ఫాతిమాబీ ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి..

పట్టణంలోని పీఎంహెచ్ కాలనీకి చెందిన మహ్మద్ రహీం అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 13 న చేపలు పట్టడానికి వెళ్తున్నానని భార్యకు చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లిన రహీం తిరిగి రాలేదన్నారు. ఆచూకీ లభించకపోవడంతో రహీం భార్య కమ్రున్నీసా ఫిర్యాదు చేసిందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గొల్లపల్లికి చెందిన మహిళ..

డిచ్‌పల్లి: మండలంలోని గొల్లపల్లికి చెందిన గంగలక్ష్మి అదృశ్యమైనట్లు ఎస్సై యూ.మహేశ్ తెలిపారు. సోమవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన గంగలక్ష్మి తిరిగిరాకపోవడంతో తల్లి నర్సవ్వ ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లింగారెడ్డిపేటకు చెందిన..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని లింగారెడ్డిపేటకు చెందిన మార్గం భాగ్య అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. తన గొడవపడిన భాగ్య ఈనెల 7వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదని ఆమె భర్త సిద్ధయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.